సాక్షి అనకాపల్లి

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024



ఆరోగ్య శ్రీ.. పేదోడి ధైర్యం

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేద రోగులకు వరంగా మారింది. క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చింది. IIలో



ఫ్యాన్సీ డ్రెస్.. అదుర్స్ IIలో

రంజాన్ వేళలు

అనకాపల్లి

	ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
అనకాపల్లి	6.15	4.31
నర్సీపట్నం	6.18	4.29

న్యూస్‌రీల్

డీఆర్ఐ అధికారులపై దౌర్జన్యం కేసులో నోటీసులు

టీడీపీ అభ్యర్థి రాజుతోపాటు టైల్స్ యజమానులకు నోటీసులిచ్చిన పోలీసులు

చోడవరం: డీఆర్ఐ అధికారుల విధులకు ఆటంకం కలిగించి, దౌర్జన్యానికి పాల్పడిన చోడవరం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్. రాజుతోపాటు బుచ్చిరాజు ట్రేడర్స్ టైల్స్ దుకాణం యజమానులకు ఆదివారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. చోడవరం మండలం గాంధీగ్రామం పంచాయతీలో ఉన్న బుచ్చిరాజు ట్రేడర్స్ టైల్స్ దుకాణం యజమానులు జీఎస్టీ కట్టకపోవడంతో ఈనెల 4న డీఆర్ఐ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అధికారులు తనిఖీలు చేయకుండా బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి రమేష్, చోడవరం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, షాపు యజమానులు అడ్డుకున్నారు. విధులకు ఆటంకం కలిగించడంతోపాటు దౌర్జన్యం చేశారంటూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ కేసును అనకాపల్లి డీఎస్పీ విచారణ చేస్తున్నారు. విచారణలో భాగంగా టీడీపీ అభ్యర్థి రాజుతోపాటు టైల్స్ దుకాణం యజమాని బుచ్చిరాజు, రామకృష్ణ వారి కుమారులిద్దరికీ నోటీసులు జారీ చేశామని చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. విచారణకు హాజరుకావాలని పేర్కొంటూ నోటీసులు ఇచ్చామన్నారు.

విశాఖ బార్ అసోసియేషన్ ఎన్నిక ప్రక్రియ పూర్తి

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. కార్యవర్గంలో అన్ని పదవులకు పడిన ఓట్ల వివరాలను ఆదివారం ఎన్నికల సంఘం అధికారి కేశప్రగడ వెంకట నరసింహమూర్తి వెల్లడించారు. కార్యనిర్వాహక సభ్యులుగా న్యాయవాదులు టి.రమాదేవి, బి.కుమారస్వామి, జి.వసంత లక్ష్మి, టి.పార్వతి, ఎం.గౌరీప్రసాద్, జి.జాన్‌ప్రసాద్ ఎన్నికయ్యారని తెలిపారు.

సీఎం రమేష్ రౌడీయిజం!



డీఆర్ఐ అధికారులతో వాగ్వాదం చేస్తున్న సీఎం రమేష్, కేఎస్ఎన్ఎస్ రాజు

- అనకాపల్లి జిల్లాలో అధికారులకు బెదిరింపులు
- తనిఖీలు జరగకుండా అడ్డుకునేందుకు కుయుక్తులు
- అనకాపల్లి లాడ్జీల్లో రౌడీమూకల మకాం
- ఇష్టారీతిలో ప్రలోభపరిచేందుకు యత్నాలు
- రమేష్‌కు జతకలిసిన అయ్యన్న... భారీ ప్యాకేజీ ముట్టిందని ప్రచారం
- రౌడీమార్క్ రాజకీయాన్ని సహించేది లేదంటున్న జిల్లావాసులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

టీడీపీ మాజీ నేత, బీజేపీ ప్రస్తుత నేత సీఎం రమేష్ తన మార్క్ రౌడీ రాజకీయాలకు తెరతీశారు. అనకాపల్లి జిల్లాలో అరాచకాలు సృష్టిస్తున్నారు. ఎక్కడా తనిఖీలు నిర్వహించకుండా ముందస్తుగానే అధికారులపై ఎదురుదాడికి దిగుతున్నారు. తనిఖీలు నిర్వహించే అధికారుల వద్దకు వెళ్లి నిలువరించే ప్రయత్నం చేస్తున్నారు. అసలు అధికారులు తనిఖీలు నిర్వహించకూడదంటూ ప్రశ్నిస్తున్నారు. ఎదురుదాడికి మించిన ఆత్మరక్షణ లేదనే ధోరణితో ఎన్నికల్లో తాము చేసే అక్రమాలకు అడ్డురాకూడదనే ఆలోచనతో ఈ తరహాలో బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇప్పటికే అనకాపల్లిలోని లాడ్జీల్లో కడప నుంచి వచ్చిన అనుచరులు మకాం వేసి హల్‌చల్ చేస్తున్నారు.

అంతేకాకుండా టీడీపీ నేత అయ్యన్నపాత్రుడుతో తనకున్న పాత పరిచయాలతో ఇద్దరూ కలిసి నోటికి పనిచెబుతున్నారు. ఇప్పటికే అయ్యన్నకు భారీ ప్యాకేజీని సీఎం రమేష్ అందించారనే ప్రచారం జరుగుతోంది. రానున్న రోజుల్లో తాము చేసే విచ్చలవిడి అరాచకాలకు అడ్డులేకుండా చూసుకునేందుకే.. అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించకుండా అడ్డుకట్ట వేసేందుకు భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా ప్రశాంతంగా ఉన్న అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో సీఎం రమేష్ రాకతో అలజడి ప్రారంభమైంది.



ఈనెల 6వ తేదీన నర్సీపట్నంలో చీరల పంపిణీని అడ్డుకున్న పోలీసులపై చిందులేస్తున్న కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

కోతికి కొబ్బరి చిప్ప!

అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఇష్టారీతిలో చెలరేగి అధికారులపై మాటల దాడికి దిగుతున్నారు. ఇప్పుడు కల్లు తాగిన కోతికి కొబ్బరి చిప్ప దొరికిన చందంగా... ఈయనకు కాస్తా సీఎం రమేష్ జతకలిశారు. దీంతో నోటికి అదుపులేకుండా అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం చోడవరంలోని ఒక షాపులో పన్ను ఎగవేతకు సంబంధించిన వ్యవహారంలో డీఆర్ఐ అధికారులు తనిఖీలు వస్తే.. వెంటనే సీఎం రమేష్ రంగంలోకి దిగారు. అధికారులు తనిఖీలు చేయవద్దంటూ అడ్డుకోవడంతోపాటు బెదిరింపులకు దిగారు. తాజాగా నర్సీపట్నంలో నోట్లు, చీరలు పంచుతూ ఓటర్లను ప్రలోభపరిచేందుకు కూటమి చేసే ప్రయత్నాలపై ఫిర్యాదు రావడంతో అధికారులు తనిఖీలకు వెళ్లారు. వెంటనే ఒకవైపు సీఎం రమేష్... మరోవైపు అయ్యన్నపాత్రుడులు అధికారులపై మాటల దాడికి దిగారు. తనిఖీలు ఎలా చేస్తారంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు.

చీఫ్ సెక్రటరీ, డీజీపీపై పరుష వ్యాఖ్యలు

ఇక అయ్యన్న ఏకంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు డీజీపీలు వెధవలు అంటూ వరుసంగా వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా ఎన్నికల సమయంలో అధికారులు తనిఖీలకు వస్తే అభ్యర్థులు సహకరించడం సహజం. అంతేకాకుండా ఎన్నికలకు సంబంధం లేని వ్యక్తుల వద్ద తనిఖీలు నిర్వహించినప్పటికీ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా సహకరించడం పరిపాటి. ఇందుకు భిన్నంగా ఈ ఇద్దరూ అడ్డగోలుగా అధికారులపై ఆరోపణలు గుప్పిస్తూ బెదిరింపులకు దిగుతున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా సహకరిస్తూ తమ ప్రచారాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసే బెదిరింపుల ద్వారా లబ్ధి పొందేందుకు ఆ ఇద్దరూ ప్రయత్నిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లాడ్జీల్లో మకాం!

స్థానికంగా కనీసం ఒక్క ఓటరుతోనూ పరిచయం లేని సీఎం రమేష్... కేవలం రౌడీయిజం ద్వారానే ఎన్నికల్లో ముందుకు వెళ్లేందుకు కృతనిశ్చయంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా అనకాపల్లిలోని లాడ్జీల్లో ఇప్పటికే 200 మందికిపైగా తన అనుచరులు మకాం వేశారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకూ అనకాపల్లిలోని లాడ్జీలను బుకింగ్ చేసుకున్నారు. కౌంటింగ్ వరకూ ఇక్కడే మకాం వేసి పార్లమెంటు నియోజకవర్గం మొత్తం తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మరోవైపు మొదటగా సీఎం రమేష్ నియోజకవర్గంలో తిరుగుతూ టీడీపీ, జనసేన నాయకులను కలిసి తమకు సహకరించాలంటూ భారీగానే ప్యాకేజీని ముట్టచెప్పినట్టు తెలుస్తోంది. అనంతరం సీఎం రమేష్ రాక సందర్భంగా హడావుడి చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

అయ్యన్నకు నోట్ల కట్టలు?

ఇన్నాళ్లూ అనకాపల్లి ఎంపీ సీటు **స్థానికుడికి ఇవ్వాలని హడావుడి** చేసిన **అయ్యన్న.. సీఎం రమేష్** విషయంలో **మాత్రం ఒక్క మాట మాట్లా**డడంలేదు. **పైగా అయ్యన్ననే వెంటబెట్టు**కుని మరీ **తిరుగుతున్నారు. ఈ వ్యవహా**రంలో భారీ**గానే అయ్యన్నకు ప్యాకేజీ** ముట్టిందని **టీడీపీ నేతలు చెవులు కొరుక్కు**ంటున్నారు. **ఒకవైపు రౌడీయిజం.. మరో**వైపు నోట్ల **కట్టల ద్వారా ఎన్నికల్లో ముందు**కెళ్లేందుకు సీఎం రమేష్ చేస్తున్న ప్రయత్నాలపై అనకాపల్లి **జిల్లాలో** ఓటర్ల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రశాంతంగా ఉన్న అనకాపల్లి జిల్లాలో వీరి రాకతో రానున్న రోజుల్లో ఏమి జరుగుతుందోనని భయాందోళన చెందుతున్న ఓటర్లు అందరివాడు, సౌమ్యుడు బూడి ముత్యాలనాయుడుతో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ అభ్యర్థులవైపు మొగ్గుచూపుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చోడవరంలో కేసు నమోదు

జీఎస్టీ చెల్లించకుండా అనధికారికంగా వ్యాపారం సాగిస్తున్న బుచ్చిబాబు ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం (డీఆర్ఐ) అధికారుల విధులకు ఆటంకం కల్గించడమే కాకుండా వారిపై దౌర్జన్యం చేసినందుకు అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, టీడీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజు చోడవరం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎన్నికల్లో ఓటర్లు రెచ్చగొట్టేలా ప్రవర్తించడంతో పాటు కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను ధిక్కరించడం, విధుల్లో ఉన్న అధికారులపై దౌర్జన్యాలకు పాల్పడడం వంటి సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. శనివారం రాత్రి సీఎం రమేష్‌కు పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చారు. ఈ నెల 9న విచారణకు హాజరు కావాలని అనకాపల్లి ఎస్డీపీవో ఆదేశించారు.

టీడీపీ అభ్యర్థుల ఊసేలేదు

- వారాహి యాత్రలో కనిపించని సైకిల్ గుర్తు
- బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, జనసేన అభ్యర్థి కొణతాలను గెలిపించాలని కోరిన పవన్ కల్యాణ్
- యలమంచిలి అభ్యర్థి సుందరపు పేరూ ప్రస్తావించని జనసేన అధినేత
- నిరుత్సాహాన్ని మిగిల్చిన ప్రసంగం
- తప్పులు, తడబాటుతో స్పీచ్

సాక్షి, అనకాపల్లి/తుమ్మపాల: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహియాత్రలో టీడీపీ అభ్యర్థుల ప్రస్తావన లేకపోవడంతో ఆ పార్టీ క్యాడర్ గందరగోళానికి గురైంది. అనకాపల్లిలో ఆదివారం రెండు గంటల పాటు సాగిన వారాహియాత్రలో బీజేపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని మాత్రమే కోరారు. కేవలం ఆ రెండు పార్టీల గుర్తులను మాత్ర మే ప్రదర్శించారు.ఎక్కడా టీడీపీ అభ్యర్థుల గురించి మాట్లాడాలేదు. జిల్లాలో అనకాపల్లి, పెందుర్తి, యలమంచిలి అసెంబ్లీ టికెట్‌లను జనసేన అభ్య ర్థులకు కేటాయించారు. అయితే పవన్ కల్యాణ్ తన ప్రసంగంలో బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, జనసేన అనకాపల్లి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, పెందుర్తి నుంచి పంచకర్ల రమేష్‌బాబులను గెలిపించాలని కోరారు. యలమంచిలి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ పేరును ప్రస్తావించలేదు. ఎక్కడో ఉన్న తెనాలి నియోజకవర్గం అభ్యర్థి నాదెండ్ల మనోహర్, ఇటీవలే రెండు రోజుల క్రితమే జనసేనలో చేరిన మండలి బుద్ధప్రసాద్‌ను సీనియర్, బలమైన నాయకులకు జనసేన నుంచి పోటీకి దించాం. వారిని గెలిపించాలని పవన్‌కల్యాణ్ కోరారు. విజయ్‌కుమార్ పేరును ప్రస్తావించకపోవడంతో అనుమానాలు ఏర్పడ్డాయి.

సమస్యలపై అవగాహన లేమి

అనకాపల్లిలో సమస్యలపై పవన్ కల్యాణ్ మాట్లాడతారేమోనని అందరూ భావించారు. ఆయన ప్రసంగం మొత్తం విన్న అనకాపల్లి ప్రజలంతా పవన్ కల్యాణ్‌కు ఇక్కడ సమస్యలపై అవగాహన లేదని గ్రహించారు. బహిరంగ సభలో స్క్రిప్ట్ కూడా సరిగ్గా చదవలేకపోయారు. ఒక సమస్య గురించి మొదలు పెట్టడం. తప్పుగా పలకడం..నాలుక తిరగకపోవడంతో మరో అంశం మాట్లాడడంతో అయోమయానికి గురిచేసింది. పవన్ కల్యాణ్ గంటపాటు చేసిన ప్రసంగంలో 50 పైగా తప్పులు మాట్లాడారు.

తడబాటు..

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని కాస్తా.. సృజనా స్రవంతి అని..ఉద్యోగుల విరమణ సమయంలో ఇచ్చే కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ను..కంట్రీబ్యుట్ పెన్షన్ స్కీమ్ అని ..కశింకోట మండలంలో విసన్నపేట భూములు అనబోయి.. విసన్నపేట మండలం కశింకోట భూములు అని.. తుమ్మపాల సుగర్స్‌ను తువ్వపాల అని.. బినామీని బినామా అని పలికారు. ప్రారంభం నుంచి చివరి వరకూ ఆయన ప్రసంగం తడబాటుగానే సాగింది.

ఆలస్యంగా యాత్ర..

సాయంత్రం 4.02 నిమిషాలకు అనకాపల్లికి వచ్చిన పవన్ కల్యాణ్ 6 గంటల వరకూ హెలిప్యాడ్ వద్ద వారాహి వాహనంలో ఉండిపోయారు. ఆరు గంటలకు ప్రారంభం కావాల్సిన బహిరంగ సభ ఏడు గంటలకు మొదలైంది. పవన్‌కల్యాణ్ యాత్ర సందర్భంగా అనకాపల్లి టౌన్‌లోగల నెహ్రూచౌక్ జంక్షన్ నుంచి ట్రాఫిక్ నిలిపివేయడంతో ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. అడుగడుగునా కోడ్ ఉల్లంఘిస్తూ జనసేన కార్యకర్తలు, నాయకులు రోడ్ల పక్కనే మద్యం, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



వారాహి యాత్రలో బీజేపీ, జనసేన గుర్తులు పట్టుకుని అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్

యలమంచిలి హుళక్కేనా..!

అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో మూడు అసెంబ్లీ సీట్లు జనసేనకు కేటాయించారు. అనకాపల్లి అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ, పెందుర్తి అభ్యర్థిగా పంచకర్ల రమేష్‌బాబు, యలమంచిలి అభ్యర్థిగా సుందరపు విజయ్‌కుమార్‌లను ప్రకటించారు. అనకాపల్లిలో జరిగిన వారాహి యాత్రలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ యలమంచిలి నియోజకవర్గ అభ్యర్థి సుందరపు విజయకుమార్ పేరును ఎక్కడా ప్రస్తావించలేదు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వారాహి యాత్ర షెడ్యూల్‌లో ఈ నెల 7న యలమంచిలిలో బహిరంగ సభ, 8న అనకాపల్లిలో బహిరంగ సభ అని ప్రకటించారు. కానీ యలమంచిలిలో వారాహియాత్ర రద్దు చేసి..7వ తేదీన అనకాపల్లిలో ఏర్పాటు చేశారు. దానికి తోడుగా అనకాపల్లి సభలో యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. వారాహి వాహనం మీద కూడా ఎక్కడా సుందరపు విజయ్‌కుమార్ కనిపించలేదు. పవన్ కల్యాణ్ విశాఖకు వచ్చారంటే సుందరపు విజయకుమార్ రాకుండా ఉండరు. అలాంటిది అనకాపల్లి వారాహియాత్ర సభలో సుందరపు ఎక్కడా కనిపించ లేదు.

కొణతాల టీం అజమాయిషీతో తమ్ముళ్ల ఆవేదన

పవన్ సభకు అయ్యే ఖర్చంతా బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ భరించారు. అనకాపల్లి పరిసరాల నుంచి జనాన్ని తరలించే బాధ్యత కొణతాలకు అప్పగించారు. కాగా కొణతాల రామకృష్ణ టీడీపీ క్యాడర్‌ను కాదని గతంలో ఉన్న తన పాత అనుచర వర్గాన్ని రంగంలోకి దించారు. ప్రతి గ్రామంలోను కొణతాలకు ఒకరిద్దరు అనుచరులు ఉన్నారు. గ్రామాల్లో డబ్బు పంచే బాధ్యత వారికే అప్పగించారు. వారు శనివారం రాత్రి గ్రామాల్లో టీడీపీ నేతలకు నగదు అందజేసి, జనాన్ని తరలించాలని ఆదేశించారు. ఇది తెలుగు తమ్ముళ్లకు ఏ మాత్రం నచ్చలేదు. దీంతో టీడీపీ నేతలు కొణతాల అనుచరులపై తిరుగుబాటు చేశారు. బైక్‌కు పెట్రోల్, మనిషికి రూ.500 కిరాయి, ఆటోలకు టోకెన్లు లెక్క పెట్టి ఇవ్వడంతో టీడీపీ నేతలు అవమానంగా భావించారు. వాగ్వాదాలకు దిగారు. కొన్ని గ్రామాల్లో గొడవలు లేకుండా కొణతాల అనుచరులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

అనకాపల్లిలో సైకిల్

- మిత్రపక్షాలకు అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు
- ఈ సారి ఎన్నికల బ్యాలెట్‌లో కనిపించని టీడీపీ గుర్తు
- పార్టీ క్యాడర్‌లో సన్నగిల్లుతున్న ఉత్సాహం



తుమ్మపాల: ఈ దఫా ఎన్నికల్లో అనకాపల్లి తెలుగు తమ్ముళ్లకు చిత్రవిచిత్ర పరిస్థితులు ఎదురవుతున్నాయి. తొలుత అనకాపల్లి అసెంబ్లీ టికెట్ జనసేన పార్టీకి కేటాయించడంతో షాక్ అవ్వగా, ఆ తర్వాత పార్లమెంటు టికెట్ బీజేపీకి ఇవ్వడంతో నిరాశకు లోనయ్యారు. ఈ నేపథ్యంలో నూతన జిల్లాగా అనకాపల్లి అవతరించిన మొదటి ఎన్నికల్లోనే టీడీపీ సైకిల్ గుర్తు అటు పార్లమెంట్, ఇటు అసెంబ్లీ ఎన్నికల బ్యాలెట్‌లోనూ కనుమరుగు కానుంది. ఎన్టీఆర్ స్థాపించిన నాటి నుంచి అనకాపల్లిలో సైకిల్ గుర్తుకే ఓటేసి తమ అభిమానాన్ని చూపిస్తూ వస్తున్నారు. ఈసారి ఇప్పుడు తమ ఓటును ఎటు వేయాలో తెలియక తికమకపడుతున్నారు. నియోజకవర్గంలో తెలుగుతమ్ముళ్ల చిరకాల ప్రత్యర్థి కొణతాల రామకృష్ణను, అది గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి గెలిపించుకునేలా టీడీపీ దిగజారిపోవడం కార్యకర్తలకు ఏమాత్రమూ మింగుడు పడటం లేదు. ఉత్సాహంగా దూసుకుపోతున్న ఫ్యాన్ గుర్తు కార్యకర్తలను చూసి తలదించుకోవాల్సి వస్తుందని పలు సమావేశాల్లో నాయకుల వద్ద వాపోతున్నట్టు తెలిసింది.

దిగుమతి నాయకులతో తమ్ముళ్లకు దిగులే...

గత ఎన్నికల నుంచి పార్టీలను నమ్ముకుని ఇక్కడ పని చేసిన నాయకులు పీలా గోవింద సత్యనారాయణ(టీడీపీ), పరుచూరి భాస్కరరావు (జనసేన పార్టీ)లను కాదని అనకాపల్లిని వదిలి 15 ఏళ్ల క్రితం విశాఖలో స్థిరపడిన కొణతాల రామకృష్ణను జనసేన పార్టీ తరఫున తీసుకురావడం ఒక దెబ్బ అయితే, పార్లమెంట్ అభ్యర్థిగా ఈ ప్రాంతంపై కనీస అవగాహన లేని కడప నాయకుడు సీఎం రమేష్‌ను బీజేపీ నుంచి బరిలో దించడంతో పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయ్యిందని తెలుగు తమ్ముళ్లు లబోదిబోమంటున్నారు. బతికున్నా.. జీవచ్ఛవాల్లాగే ఈ ఎన్నికల్లో పనిచేయడం కంటే ఫ్యాన్ గుర్తుకే ఓటేయడం బెటర్ అంటూ అనేకమంది టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరిపోతున్నారు.

అలకతో జగన్ వద్ద ప్రాధాన్యాన్ని కోల్పోయిన కొణతాల రేపు కార్యకర్తలకు దూరంగా మునిపటిలా కనిపించకపోతే తమ గతేం కానని, ఇక బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను ఎన్నికల తర్వాత కలవాలంటే ఢిల్లీ వెళ్లాలేమో అంటూ గుసగుసలాడుకుంటున్నారు. చోడవరంలో ప్రభుత్వ అధికారులపైనే కడప మార్కు రాజకీయం చేస్తే, రేపు మనపై, ఈ ప్రాంతంపై చేయబోరని గ్యారెంటీ ఏంటని మల్లగుల్లాలు పడుతున్నారు.

నూకాంబికా నమోస్తుతే

- ఘనంగా ప్రారంభమైన నూకాంబిక జాతర
- అమ్మవారికి వేడుకగా అమావాస్య పూజలు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అనకాపల్లి నూకాంబిక అమ్మవారి జాతర ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతుండటంతో బాలాలయంలో పూజలు నిర్వహించారు. ఈవో బండారు ప్రసాద్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. జాతర సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయాన్ని రాత్రంతా తెరిచే ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. పలువురు భక్తులు ఉపవాస దీక్ష చేపట్టి, అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడుతూ ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు అసౌకర్యం కలుగకుండా పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీరు, పిల్లలకు పాలు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు జీవీఎంసీ అధికారులు తగిన పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పిస్తున్న భక్తులు

పూర్తిస్థాయిలో బందోబస్తు

కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని ఎన్నికల నిబంధనలు పాటిస్తూ పూర్తిస్థాయిలో పోలీస్‌బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. జాతర బందోబస్తును ఆదివారం రాత్రి ఆయన పరిశీలించారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎటువంటి సమస్యలకు గురికాకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.అప్పలరాజు, సీఐలు పి.పైడపునాయుడు, శంకరరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఈవో బండారు ప్రసాద్



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ


ఇద్దరు పిల్లలతో మనోహర్, గౌతమి

ఆరోగ్య శ్రీ.. పేదోడి ధైర్యం



ఇద్దరు పిల్లలకూ వైద్యం

నా పేరు కడలి మనోహర్. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఊటగుంట సావరంలో నివసిస్తున్నాం. మేనరికం కారణంగా ఇద్దరు పిల్లలు మూగ, చెముడుతో జన్మించారు. కార్పెంటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాం. పిల్లలిద్దరూ ఇలా జన్మించడంతో చాలా ఆవేదనకు గురయ్యాం. ఎన్నో ఆస్పత్రులకు తిరిగినా ప్రయోజనం లేకపోయింది. పెద్ద కుమారుడు మోహన్‌కృష్ణ (9)కు మాటలు రాక పోవడం, కుమార్తెకు చెప్పినా వినబడకపోవడంతో మానసిక వేదనకు గురయ్యాం. తెలిసివాళ్లు ఆరోగ్యశ్రీ పథకం గురించి చెప్పారు. 2021 డిసెంబర్‌లో మోహన్‌కృష్ణను విశాఖలోని ఈఎన్‌టీ ఆస్పత్రికి తీసుకొచ్చాం. కొద్ది రోజుల తర్వాత వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేశారు. రూ.7 లక్షలకు పైచిలుకు ఖర్చుతో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేశారు. దీంతో నా కుమారుడికి మాటలు వచ్చాయి. ఇప్పుడు స్కూల్లో కూడా చేర్పించాం. తాజాగా నా కుమార్తె కడలి దివ్య వెంకట సత్య (మూడున్నరేళ్లు)ను కూడా విశాఖలోని ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స నిర్వహించారు.

మహారాణిపేట, మధురవాడ, సీతమ్మధార: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేద రోగులకు వరంగా మారింది. వ్యాధుల సంఖ్య పెంచడంతో పాటు క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చడంతో ఎంతో మందిలబ్ధి పొందుతున్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందడంతో ఆరోగ్యవంతులు చిరునవ్వుతో ఇంటికి వెళుతున్నారు.

కార్డుల పంపిణీ పూర్తి : సరికొత్త ఫీచర్లతో రూపుదిద్దుకున్న ఆరోగ్యశ్రీ కార్డులను జిల్లాలో పంపిణీ పూర్తి చేశారు. కుటుంబానికి రూ.25 లక్షల విలువ గల ఆరోగ్య సేవలు అందించడానికి రూపొందించిన 4.40 లక్షల కార్డుల పంపిణీ పూర్తయింది.

జిల్లాలో ఆస్పత్రుల వివరాలు: విశాఖ జిల్లాలో మొత్తం 50 నెట్‌వర్క్, 19 ప్రభుత్వ, 20 డెంటల్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్నాయి. 2019 జూన్ ఆరో తేదీ నుంచి గతేడాది మార్చి 31వ తేదీ వరకు 2,41,903 మంది రోగులకు చికిత్సలు, శస్త్ర చికిత్సలు అందించారు. వీరి కోసం రూ.490 కోట్ల 79 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసింది.

ఎంతో పారదర్శకంగా..: ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు పొందిన రోగికి ఆర్థిక సాయంతో పాటు వైద్య సేవలపై అభిప్రాయాన్ని కూడా లిఖితపూర్వకంగా సేకరిస్తున్నారు. ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయి. మందులు, ఆహారం సక్రమంగా అందజేశారా? ఏమైనా ఇబ్బందులు ఏర్పడ్డాయా అని రోగి కన్ఫర్మేషన్ లెటర్‌పై సంతకం చేయాలి. ఆ తర్వాతే బిల్లు పేమెంట్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వారం రోజుల తర్వాత సచివాలయ ఆరోగ్యమిత్ర, ఏఎన్‌ఎంలు రోగి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు. రోగి ఇచ్చిన సమాధానం మీద ఆస్పత్రి బిల్లు ఆధారపడి ఉంటుంది.

ఉమ్మడి విశాఖకు చెందిన దేవిది పేద కుటుంబం. ఆమె భర్త ఆటోడ్రైవర్. ఇద్దరు పిల్లలు. అనారోగ్యానికి గురవడంతో వైద్యులను సంప్రదిస్తే కిడ్నీ సమస్య ఉందని, చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. కొన్ని రోజుల దయాలసిస్ చేశారు. ఆ తర్వాత కిడ్నీ మార్పిడి చేయాలన్నారు. ఇందుకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని చెప్పారు. అంత మొత్తం ఖర్చు చేసే స్థితిలో ఆ కుటుంబం లేదు. కొన్ని రోజుల పాటు మదనపడ్డారు. ఆ సమయంలో ఆమెకు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ అండగా నిలిచింది. బీరువాలో దాచిన ఆరోగ్య శ్రీ కార్డును తీసుకుని కేజీహెచ్ వైద్యులను సంప్రదించారు. ఈ కార్డు ఏమైనా ఉపయోగపడుతుందా? అని సిబ్బందికి చూపించాను. తర్వాత ఆరోగ్యశ్రీ ద్వారా కిడ్నీ మార్పిడి జరిగింది. 'ఆరోగ్య శ్రీ పథకం కాదు.. నాలాంటి పేదలకు గుండె ధైర్యం..' అంటూ ఆమె ఆనందం వెలిబుచ్చారు.

- వ్యాధులేవైనా ప్రాణాలు నిలబెడుతున్న వైనం
- 3,257 చికిత్సలకు ఉచిత వైద్యం
- సరికొత్త ఫీచర్లతో జిల్లాలో 4.40 లక్షల కార్డుల పంపిణీ

రోగాల సంఖ్య పెంపు

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీని ప్రవేశ పెట్టారు. 1,059 వ్యాధులతో శ్రీకారం చుట్టారు. ఆయన మరణానంతరం ఆరోగ్యశ్రీని ఆయా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మళ్లీ ఆరోగ్యశ్రీకి మహర్దశ పట్టింది. క్యాన్సర్‌తో సహా 3,257 వ్యాధులకు ప్రస్తుతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందజేస్తున్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా


నా పేరు చెన్నూరి గౌరీ పార్వతి. నక్కవానిపాలెంలో నివాసముంటున్నాం. 2021లో గుండెలో నొప్పిగా ఉంటే ఆస్పత్రిలో చూపించాం. ఆపరేషన్ చేయాలని, స్టెంట్ వేయాలని వైద్యులు చెప్పారు. ఒక్కసారిగా ఆందోళన చెందా. భర్త అప్పలరాజు కూడా కంగారు పడ్డారు. ఆరోగ్యశ్రీలో నాకు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేశారు. ఈ రోజు బతికి ఉన్నానంటే అది జగన్‌బాబు దయతోనే. లక్షల ఖర్చుతో కూడిన ఆపరేషన్ ఉచితంగా చేయించారు. జగన్ బాబు చేసిన సాయానికి జీవితాంతం రుణపడి ఉంటాం. డిశ్చార్జి అయిన తర్వాత రూ.5 వేలు నా అకౌంట్లో కూడా వేశారు. ఇలాంటి ముఖ్యమంత్రిని నేనెన్నడూ చూడలేదు.



దేవుడిలా ఆదుకున్నారు

నా పేరు ఊడి లక్ష్మి. మధురవాడ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం వైఎస్సార్ కాలనీ 22వ బ్లాకు, ఎస్‌ఎఫ్2లో నివాసం ఉంటున్నాం. నా భర్త అచ్యుతరావు, ఆటో డ్రైవర్. అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆస్పత్రిలో చూపిస్తే నోటి క్యాన్సర్ అని నిర్ధారించారు. చాలా డబ్బులు ఖర్చుపెట్టాం. ఆరోగ్యశ్రీలో చికిత్స చేయవచ్చని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వాళ్లు చెప్పారు. రూ.లక్షన్నర ఖర్చుతో వైద్యం చేశారు. మాటలు కూడా రావడం లేదు. ప్రస్తుతం ఆరిలోవ పినాకిల్‌లో కూడా ఆరోగ్యశ్రీ ద్వారానే కిమోథెరపీ జరుగుతోంది. ఆరోగ్యశ్రీ లేకపోతే నా భర్తకు వైద్యం అందేది కాదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మా ఇంటికి పెద్దదిక్కుగా నిలిచారు. ఆయన చల్లగా ఉండాలి.


ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న అచ్యుతరావుతో ఆయన భార్య లక్ష్మి



అండగా ఆసరా

వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకున్న రోగికి వైద్యానంతరం ఆసరా కింద ఆర్థిక సహాయం అందిస్తున్నారు. రోజుకు రూ.225 నుంచి నెలకు గరిష్టంగా రూ.5 వేల వరకు జీవనభృతి కింద రోగికి అందజేస్తున్నారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన రోజే రోగి ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నారు. 2019 జూన్ ఒకటో తేదీ నుంచి గత ఏడాది డిసెంబర్ 31వ తేదీ వరకు 1,21,124 మంది రోగులకు ఆసరా అందించారు. వీరికి రూ.66.22 కోట్ల సహాయం అందజేశారు.

అన్నలా ఆదుకున్నారు



నా పేరు బాడితబోయిన వెంకటలక్ష్మి. మాది పెందుర్తి. భర్త రాము ఆటో డ్రైవర్. ఏ రోజు ఆదాయం ఆ రోజుకే సరిపోతుంది. అలాంటి సమయంలో నాకు వెన్నుపూస సమస్య వచ్చింది. వైద్యుల దగ్గరకు వెళితే ఆపరేషన్ చేయాలని, రూ.30 వేలకు పైగా ఖర్చు అవుతుందన్నారు. కానీ మా దగ్గర అంత డబ్బు లేకపోవడంతో ఆరోగ్యశ్రీని ఆశ్రయించాం. వెంటనే ఆపరేషన్ కోసం రూ.30 వేలు ప్రభుత్వం మంజూరు చేసింది. నగరంలోని గీతం ఆస్పత్రిలో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నాను. డిశ్చార్జి చేసి.. ఖర్చుల కోసం మరో రూ.8 వేలు ప్రభుత్వం నా ఖాతాలో వేసింది. రూపాయి ఖర్చు లేకుండా పూర్తి ఆరోగ్యంతో ఇంటికి వచ్చాను. జగనన్న సొంత అన్నలా ఆదుకున్నారు.


కెల్లా రామకృష్ణకు పొట్టమీద వచ్చిన వాపు

ఆరోగ్యశ్రీ ప్రాణాలు కాపాడింది

నా పేరు కెల్లా రామకృష్ణ. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ..పూర్ణామార్కెట్ ఏరియాలో నివసిస్తున్నాను. పొట్టమీద పెద్ద వాపు వచ్చింది. వైద్యులను సంప్రదిస్తే పేగు క్యాన్సర్ అని నిర్ధారించారు. శస్త్ర చికిత్స చేయాలంటే చాలా డబ్బు ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో ఏం చేయాలో దిక్కు తోచలేదు. కేజీహెచ్‌లో వైద్యులను సంప్రదించాను. జనరల్ సర్జరీ ఎస్5 యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ బి.తేజేశ్వరరావు ఆధ్వర్యంలో మూడు గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్స చేశారు. పూర్తిగా కోలుకున్నాక డిశ్చార్జి చేశారు. ఆరోగ్యశ్రీ నాకు ప్రాణభిక్ష పెట్టింది.


శస్త్ర చికిత్స అనంతరం ఇలా..



పేద ప్రజలకు వైద్య సేవలు

తెలుపు కార్డు కలిగిన పేదలు ఆరోగ్యశ్రీ పరిధిలోకి వస్తారు. ఏదైనా ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీలో వైద్యం అందకపోతే 104 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. ప్రభుత్వం గుర్తించిన అనేక ఆస్పత్రుల్లో వైద్యం అందించే ఏర్పాటు చేస్తాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలకు ఇబ్బంది పెడితే మా దృష్టికి తీసుకురావాలి.

– డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా సమన్వయకర్త, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ



జూలో ఉత్సాహంగా ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు


జూలో వివిధ జంతువుల వేషధారణలో చిన్నారులు


పిల్లి వేషధారణలో చిన్నారి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ నెల 8న నేషనల్ జూ లవర్స్ డే పురస్కరించుకుని మూడేళ్ల నుంచి 12 ఏళ్ల వయసున్న చిన్నారులకు ఈ పోటీలు నిర్వహించారు. జీబ్రా, పెద్ద పులి, సింహం, జిరాఫీ తదితర జంతువుల వేషధారణలో చిన్నారులు సందర్శకులను అలరించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణపై పిల్లలకు బాధ్యతాయుతమైన భావాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఈ పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. సదరన్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ సీఎండీ సతీష్, ఫ్యాషన్ డిజైనర్ పూజిత, డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు పాల్గొన్నారు.

సాగరతీరంలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

బీచ్‌రోడ్డు: రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం సాగరతీరంలో ఘనంగా ఇఫ్తార్ విందు జరిగింది. హాజీ అబుసరంగ మసీదు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. విశాఖ శాంతిని కోరుతూ ఏటా రంజాన్ మాసంలో తీరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: సకల మానవాళి, జీవులకు నీరు ప్రాణాధారమని.. నీటి బొట్టును ఒడిసి పట్టి, భావితరాలకు అందించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. జీవీఎంసీ పరిధిలోని ప్రజలు, వాణిజ్య సముదా యాలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలకు జలాశయాలు, వనరుల ద్వారా 350 మిలియన్ లీటర్ల నీటిని, 8,500 బోరు బావుల ద్వారా 1.30 మిలియన్ లీటర్ల తాగునీటిని ట్యాంకర్ల ద్వారా నిత్యం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అదనంగా మిలియన్ లీటర్ల నీటిని అవసరమైన చోట సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎప్పటికప్పుడు పైపులైన్లు లీకులు లేకుండా సరి చేసుకుంటూ.. స్నానమాచరించేటప్పుడు నీటి షవర్లకు బదులుగా బకెట్లు, మగ్గులను వినియోగిస్తూ నీటిని పొదుపు చేయాలన్నారు. తద్వారా నీటి ఆదాకు ప్రజలు సహకరించాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

1800 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం


ప్లాస్టిక్ డ్రమ్ములతో పట్టుబడిన బెల్లపుఊట

చోడవరం రూరల్ : నాటుసారా తయారీని అరికట్టడంలో భాగంగా స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది జరిపిన విస్తృత దాడుల్లో పెద్ద ఎత్తున నాటు సారా తయారీ కోసమని నిల్వ ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బిహెచ్.కిరణ్మణేశ్వరి తెలిపిన వివరాలివి. ఆదివారం స్టేషన్ పరిధిలోని బుచ్చియ్యపేట, దేవరాపల్లి మండలాల్లో విస్తృత దాడులు జరిపినట్టు తెలిపారు. బుచ్చియ్యపేట మండలం ఆర్.శివరాంపురం, దేవరాపల్లి మండలం వాకపల్లి గ్రామాలలో నాటుసారా తయారీ కోసమని సిద్ధం చేసిన బెల్లపు ఊటలతో నింపిన ప్లాస్టిక్ డ్రమ్ములు పట్టుబడడంతో వాటిని స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ పి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గంటాకు జనసేన నేతల ప్రశ్నల వర్షం

కొమ్మాది: జనసేన స్థాపించిన దగ్గర నుంచి నిరంతరం కష్టపడిన తమకు ఎవరు భరోసా కల్పిస్తారని కూటమి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావును ఆ పార్టీ నాయకులు ప్రశ్నించారు. ఎండాడలోని జనసేన కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ ఆత్మీయ సమావేశంలో గంటా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంటాకు జనసేన నాయకులు పలు ప్రశ్నలు సంధించారు. పార్టీ తమ నాయకుడు సందీప్‌కు అన్యాయం చేసిందని, ఈ ఎన్నికల్లో జెండా పట్టుకుని ప్రజల్లో ఎలా వెళ్తామన్నారు.

'ఫార్మా' మృతులకు పరిహారానికి అంగీకారం


ఎప్టోరియా యూనిట్–6లో మృతి చెందిన గోవింద్(ఫైల్)

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని ఆల్కాలీ మెటల్, అరబిందో అనుబంధ పరిశ్రమ ఎప్టోరియా యూనిట్–6లో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందిన ఇద్దరు కార్మికులకు ఆయా యాజమాన్యాలు నష్టపరిహారం చెల్లించడానికి అంగీకరించాయి. విశాఖ కేజీహెచ్ వద్ద ఇరువర్గాల మధ్య ఆదివారం జరిగిన చర్చల్లో ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఆల్కాలీ మెటల్ పరిశ్రమలో జరిగిన గ్యాస్ లీకేజీ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సూపర్‌వైజర్ సీహెచ్.రమణ కుటుంబానికి సదరు యాజమాన్యం రూ.35 లక్షల నష్టపరిహారం, దహన ఖర్చుల కోసం రూ.50 వేలు చెల్లించడానికి అంగీకరించిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఎప్టోరియా యూనిట్–6లో రియాక్టర్ పేలి మృతి చెందిన ఆళ్ల గోవింద్(32) కుటుంబానికి అరబిందో యాజమాన్యం రూ.32.50 లక్షలు చెల్లించడానికి ముందుకొచ్చిందని చెప్పారు. ఎప్టోరియా యూనిట్‌లో గాయపడిన కార్మికుడు నరేంద్రకు కన్ను దెబ్బతింది. ఈయనకు మెరుగైన వైద్యం అందించడానికి యాజమాన్యం అంగీకరించిందని గనిశెట్టి తెలిపారు.

అద్భుతం.. నాట్యకదంబం


నృత్యోత్సవాన్ని ప్రారంభిస్తున్న అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు

మద్దిలపాలెం: అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర నృత్యోత్సవంలో భాగంగా నాట్య కందంబం ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో అద్భుతంగా సాగింది. ముఖ్యఅతిథిగా సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ కళలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు. అమెరికాలో స్థిరపడిన వారు స్థాపించిన ఏపీటీఏ సంస్థ ద్వారా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం విశాఖ భరత నాట్య కళాంజలి ఫౌండర్ సంతోషి విజయ్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్య విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ పుంజల అలేఖ్యకు పద్మశ్రీ డాక్టర్ శోభానాయుడు జీవత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో నటభామిని అవార్డు గ్రహీత ఇరుగు మంజీష, వర్ష, డాక్టర్ పుంజల వినయ్‌కుమార్, కూచిపూడి కళాకేంద్రం వ్యవస్థాపకుడు ఎ.బి.బాలకొండలరావు, ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, యునైటెడ్ నేషన్స్ ఆఫ్ పీస్ అంబాసిడర్ వెంకట భవానీ అరుణ్ కొండూరు, ఎస్.ఎం.ఎస్ డెంటల్ డాక్టర్ శ్రీధర్, చిత్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను అరెస్టు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: చోడవరం పట్టణంలో జీఎస్టీ అధికారులను బెదిరించి దౌర్జన్యానికి పాల్పడిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి ప్రాంతంలో శాంతియుత వాతావరణాన్ని గుండాయిజంతో కలుషితం చేసే విధంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి వ్యవహరిస్తున్నారన్నారు. హత్య, గుండా రాజకీయాలకు తావులేకుండా ఇప్పటివరకూ జిల్లా ప్రశాంతంగా ఉందని, కడప నుంచి దిగుమతి అయిన బీజేపీ అభ్యర్థికి ఓటుతో బుద్ధి చెప్పాలని జిల్లా ప్రజలను ఆయన కోరారు. జిల్లాలో అక్రమ మద్యం నిలువలు వంటి ఘటనలు కూడా వెలుగు చూస్తున్నాయని, బీజేపీ ఎంపీ అభ్యర్థిపై అనుమానాలు ఏర్పడుతున్నాయని ఆయన చెప్పారు. సీఎం రమేష్‌ను అరెస్టు చేయించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వి.వి.శ్రీనివాసరావు, చింతకాల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థి ప్రచారంలో జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి

డాబాగార్డెన్స్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ.. జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యో గి ప్రచారంలో పాల్గొన్నారు. విశాఖ దక్షిణ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం జీవీఎంసీ జోన్–4 ఎంఎస్ఎఫ్ క్లాప్ వాహనం డ్రైవర్ పినిపిల్లి రాజు ప్రచారం చేశారు. అతనిపై చర్యలు చేపట్టాలని పలువురు ఎన్నికల అధికారులను కోరుతున్నారు.

క్లుప్తంగా

సండే.. ఎండలు మండే



కశింకోటలో నిర్మానుష్యంగా పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట: మండల ప్రజలు సూర్య తాపంతో ఆదివారం 'ఉక్క'రిబిక్కిరయ్యారు. ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంది. దీనికి స్వల్పంగా వడగాడ్పులు కూడా తోడయ్యాయి. దీంతో అత్యవసర పనులున్నవారు మినహా ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. స్థానిక ప్రధాన వీధులు సహా అన్ని వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి. ఏప్రిల్ నెలలోనే ఇంతగా ఎండల తీవ్రత ఉంటే, రానున్న మే నెలలో మరెంత ఇబ్బంది పెడతాయోనని ప్రజలు భయపడుతున్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం

కశింకోట: మండల బ్రాహ్మణ సేవా సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడిగా వేదుల వెంకటశాస్త్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక అగ్రహారంలోని వినాయక భవనంలో సంఘ నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షురాలిగా అవసరాల సీతాకామేశ్వరి, కార్యదర్శిగా మొక్కరాల కిషోర్‌కుమార్, కోశాధికారిగా గుల్లేపల్లి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కొడుకుల సత్యవతి, వేదుల శ్రీవాణి, కందాల సురేష్, గంటి కాశీ, పేరేప శ్రీవిద్య, పింగళి లలితాభవాని, కొలచిన కామేశ్వరి ఎన్నికయ్యారు. డాక్టర్ కాశీభట్ల రమణమూర్తి పర్యవేక్షించారు.

ఉచిత యోగా శిక్షణ ప్రారంభం



యోగాసనాలు వేస్తున్న స్థానికులు

అనకాపల్లి: నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి, ఆరోగ్యంగా జీవించవచ్చని పతంజలి యోగా సమితి అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో యోగా శిక్షణ తరగతుల్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. అన్ని వయస్సుల వారిలో తలెత్తే ఎన్నో ఆరోగ్య సమస్యల నుంచి యోగా ద్వారా కాపాడుకోవచ్చన్నారు. ప్రధానంగా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పెంచేందుకు యోగా దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో యోగా సమితి సభ్యులు కాండ్రేగుల విష్ణుమూర్తి, పెంటకోట సుబ్రహ్మణ్యం, బీఎస్ఎంకే జోగినాయుడు, కొణతాల శివాజీ, కోలపర్తి గంగబాబు, కర్రి గంగాధర్ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

భరతనాట్యం	: రాజా
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డీ)	: సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్	: సత్యనారాయణస్క్రీన్-2
ఫ్యామిలీ స్టార్	: షిర్డీసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
మంజుమ్మెల్ బాయ్స్	: వెంకటేశ్వర
ప్రేమలు	: శ్రీసత్య
టిల్లు స్క్వేర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-18 యూనిట్లు, ఓ పాజిటివ్-11 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 298 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 156 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



వెదురుపర్తిలో నిర్మించిన సచివాలయ భవనం



రైతు భరోసా కేంద్రం



పునరుద్ధరించిన కశింకోట-వెదురుపర్తి రోడ్డు



వెదురుపర్తి.. ప్రగతి దీప్తి

- రూ.4 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు
- అభివృద్ధి జరిగి.. వసతులు పెరిగి
- అందుబాటులో అన్ని సౌకర్యాలు

వెదురుపర్తి గ్రామం.. కశింకోట మండలానికి మారుమూలనున్న గ్రామం. గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి అంటే ఏంటో తెలియని దుస్థితి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కరోనా విపత్తు సమయాన్ని మినహాయిస్తే పట్టుమని మూడేళ్లైనా ఉండదు. ఈ తక్కువ సమయంలోనే వెదురుపర్తిలో రూ.4 కోట్లకు పైగా నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇపుడు అవసరమైన అన్ని వసతులతో వెదురుపర్తి కాస్తా 'వెలుగు'పర్తిగా మారింది.

కశింకోట: మండలంలోని వెదుర్తిపర్తి జనాభా సుమారు 2,500 మంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూ చూడనంత అభివృద్ధి జరిగింది. ప్రాధాన్యతా భవనాలతోపాటు సీసీ రోడ్లు, కాల్వలు అభివృద్ధి చేశారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. పంచాయతీ కార్యాలయం, రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే), సచివాలయ భవనం నిర్మించి ఏ అవసరం ఉన్నా.. మండల కేంద్రానికి పరుగుతీయనక్కర్లేకుండా, అన్ని సేవలూ గ్రామ స్థాయిలోనే అందుతుండటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మారిన గ్రామ స్వరూపం

రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ వ్యవస్థ అమలుతో వెదురుపర్తిలో కూడా సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యాలయం పైభాగంలో రూ.25 లక్షలు వెచ్చించి సచివాలయ భవనాన్ని నిర్మించారు.

- రైతు భరోసా కేంద్ర భవనాన్ని సుమారు రూ.23.94 లక్షలతో నిర్మించి రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, సాగులో మెలకువలు తదితర అన్ని సేవలూ అందిస్తున్నారు.
- కశింకోట నుంచి గ్రామానికి ఉన్న సుమారు 5 కి.మీ. ఆర్ అండ్ బీ రోడ్డు పూర్తిగా గతుకులు పడింది. ఏళ్ల తరబడి దీన్ని పునరుద్ధరించలేదు. రెండేళ్ల క్రితం తారు రోడ్డుగా పునరుద్ధరించడంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.

గ్రామంలో అభివృద్ధి

కశింకోట-వెదురుపర్తి రోడ్డు పునరుద్ధరణ రూ.1.91 కోట్లు	నాడు-నేడులో ప్రైమరీ స్కూల్ అభివృద్ధి రూ.18 లక్షలు
సచివాలయ భవన నిర్మాణం రూ.25 లక్షలు	సీసీ రోడ్ల నిర్మాణం రూ.20 లక్షలు
రైతు భరోసా కేంద్రం భవనం రూ.24 లక్షలు	ఎస్సీ కాలనీలో మదుం నిర్మాణం రూ.లక్ష
నాడు-నేడులో హైస్కూల్ అభివృద్ధి రూ.42 లక్షలు	వైఎస్సార్ లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు 45
నాడు-నేడులో ప్రైమరీ స్కూల్ అభివృద్ధి రూ.18 లక్షలు	రామ్‌కో సిమెంట్స్ అదనపు తరగతి గదులు రూ.60 లక్షలు



వెదురుపర్తి హైస్కూల్‌లో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ సహకారంతో నిర్మించిన తరగతి గదులు

- రూ.20 లక్షలు వెచ్చించి గ్రామంలో సిమెంట్ రోడ్లు, రూ.లక్షన్నరతో మురుగు కాలువలు నిర్మించారు.
- ఎస్సీ కాలనీ వద్ద రాకపోకలకు అనువుగా రూ.లక్షతో మదుం నిర్మించారు.
- జల్ జీవన్ మిషన్ పథకంలో రూ.34 లక్షలు వెచ్చించి దాదాపు 750 ఇళ్లకు ఇంటింటి కుళాయి కనెక్షన్లిచ్చారు.
- నాడు-నేడులో హైస్కూల్‌ను రూ.42 లక్షలు, ప్రాథమిక పాఠశాలను రూ.18 లక్షలతో అభివృద్ధి చేశారు.
- హైస్కూల్లో రామ్‌కో సిమెంట్స్ సీఎస్సార్ నిధులు రూ.60 లక్షలు వెచ్చించి ఐదు తరగతి గదులను, బాత్ రూమ్‌లను నిర్మించారు.
- నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో 45 మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో సగానికి పైగా నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. పది మంది వరకు గృహ ప్రవేశాలు జరిగి నివాసం ఉంటున్నారు.

రైతుల కష్టాలు తీరాయి



నాకు వ్యవసాయమే జీవనాధారం. గతంలో ఎరువులు, విత్తనాల కోసం దూరంగా ఉన్న కశింకోటకు వెళ్లేవాళ్లం. ఒకటికి రెండుసార్లు వెళ్తే తప్ప అవసరమైన ఎరువులు, విత్తనాలు దొరికేవి కావు. ఇప్పుడా భయం లేదు. రైతు భరోసా కేంద్రాన్ని గ్రామంలోనే ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడే అందుబాటులో మంచి విత్తనాలు, నకిలీలేని ఎరువులు పొందుతున్నాం. వ్యవసాయ సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇవి దిగుబడి పెంచేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– కంఠంరెడ్డి సత్తిబాబు, రైతు

రోడ్డుతోపాటు ఊరూ బాగుపడింది



కశింకోట, అనకాపల్లి వంటి దూరప్రాంతాలకు వెళ్లాలంటే మాకు కశింకోట-వెదురుపర్తి రోడ్డే గతి. గతంలో ఇది గతుకులు పడి చాలా అధ్వానంగా ఉండేది. రాకపోకలకు అష్టకష్టాలు పడేవాళ్లం. అత్యవసర సమయంలో ఈ రోడ్డు వెంబడి వెళ్లి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు ధైర్యం సరిపోయేది కాదు. రెండేళ్ల క్రితం దాదాపు రూ.2 కోట్లతో తారు రోడ్డు వేశారు. ఇపుడు రాకపోకలు చాలా ఈజీ అయ్యాయి. రవాణా సౌకర్యం పెరగడంతో అన్ని విధాలా ఊరు బాగుపడింది.

– ద్వారపురెడ్డి రమణమ్మ, గృహిణి

మండల కేంద్రానికి వెళ్లక్కర్లేదు



మా ఊరు మండలానికి మారుమూలన ఉంది. ఇక్కడ సచివాలయాలు లేనపుడు ఏ అవసరానికైనా మండల కేంద్రం కశింకోట వెళ్లాల్సిందే. క్యాస్ట్, ఇన్‌కమ్ తదితర సర్టిఫికెట్లు కావాలన్నా, విత్తనాలు, ఎరువులు కావాలన్నా అక్కడికే వెళ్లాల్సి వచ్చేది. ఇందుకు పనులు మానుకున్న రోజులు కూడా ఉన్నాయి. ఇపుడు మా ఊర్లోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో మండల కేంద్రానికి వెళ్లే ఇబ్బంది తప్పింది. అన్ని సేవలూ మా ఇంటి ముంగిటే అందుతున్నాయి. చాలా ఆనందంగా ఉంది.

– ప్రగడ చిట్టెమ్మ, వెదురుపర్తి

అ'పూర్వ' సమ్మేళనం



పార్కు సెంటర్‌లో శివపార్వతుల విగ్రహం వద్ద పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పార్కు సెంటర్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలతో సందడి నెలకొంది. గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్‌కు చెందిన 1970–75 మధ్య టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు పార్కు సెంటర్ వద్ద ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి బళ్ల నాగభూషణం మాట్లాడుతూ 50 ఏళ్ల తరువాత కూడా ఇంత మంది ఓ చోట చేరి పరస్పర యోగక్షేమాలు తెలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్కూల్ వయసులో అల్లరిని తలపించేలా కేరింతలు కొట్టారు. ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ ఏడాది నుంచి ప్రతి పూర్వ విద్యార్థి ఇంటి వద్ద నెలలో ఒక రోజు ఆత్మీయ విందు ఏర్పాటు చేసుకునేలా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు బొడ్డేడ అప్పారావు, పీవీ సత్యనారాయణ, పట్నాల కృష్ణమోహన్, పీఎస్ సత్యనారాయణ, విల్లూరి రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం పథకాలతో ఆరోగ్య సంరక్షణ



ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీలో తాళ్లపాలెం పీహెచ్‌సీ సిబ్బంది

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి యు.రమేష్ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని కోరారు. మరో వైద్యాధికారి మనీషా మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) పథకాలను ప్రజలు వినియోగించుకుని ఆరోగ్యవంతంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకుడు కేఎస్ఆర్‌కేజీ నరసింహరావు, హెచ్‌వీ ఆర్.వెంకటలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఆర్‌వీవీ సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా తాకాశివీధి నూకాంబిక జాతర



తాకాశివీధి నూకాంబిక అమ్మవారు



పూలతో అలంకరించిన తాకాశివీధి నూకాంబిక అమ్మవారి ఆలయం



కశింకోటలో నూకాంబిక అమ్మవారి ఆలయంలో భక్తుల పూజలు



కశింకోటలో దేవాంగులు అమ్మవారికి తీసుకెళ్తున్న సారె ఊరేగింపులో మహిళల కోలాటం

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఆదివారం రాత్రి నేత్రపర్వంగా ప్రారంభమయ్యింది. అమ్మవారికి కొత్త అమావాస్య ప్రత్యేక అలంకరణలు చేసినట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తాకాశి రాజేష్ తెలిపారు. భక్తుల దర్శనార్థం రాత్రంతా ఆలయాన్ని తెరిచి ఉంచారు. జాతర రోజున తెల్లవార్లు జాగరం చేసి అమ్మవారిని, ఉపవాసంతో దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు, సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు చింతల శ్రీనివాసరావు, వీర్ల శ్రీను, బర్ల వెంకటరమణ, ముత్యాల పద్మ, తాకాశి కన్నబాబు, తాకాశి సత్యందొర తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- మండలంలోని వివిధ గ్రామాల్లో కొత్త అమావాస్య జాతరలు శోభాయమానంగా జరిగాయి. మండలంలోని అక్కిరెడ్డిపాలెం, కూండ్రం, మామిడిపాలెం, మార్టూరు తదితర ప్రాంతాల్లో నూకాంబిక అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నెత్తిన పసుపునీళ్ల బిందెలతో పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారి ఆలయాల వద్ద విగ్రహాలకు, వేప చెట్లకు అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా దేవాలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా స్వయంభూ నూకాంబిక జాతర

కశింకోట: స్థానిక స్వయంభూ నూకాంబిక ఆలయంలో ఆదివారం అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి జాతర ఊరేగింపు నిర్వహించి, ఆలయం వద్ద అగ్ని గుండాలు తొక్కారు. అమ్మవారికి మహా నైవేద్యం పెట్టి, పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అర్చకుడు వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ముందుగా దేవాంగులు సంప్రదాయంగా సారెతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఉత్సవ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. చీరలు, రవికెలు, అరటి గెలల రూపంలో మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి మహిళల భజన కార్యక్రమం జరిగింది. సోమ, మంగళవారాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

- మండలంలోని తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం తదితర గ్రామాల్లోని నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో కొత్త అమావాస్య సందర్భంగా సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, సాయంత్రం సంప్రదాయంగా అగ్ని గుండాలు తొక్కడం ఉంటాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.
- మంగళవారం ఉగాది సందర్భంగా నరసింగబిల్లిలో ఉదయం పంచాంగ శ్రవణం, సాయంత్రం పోతురాజుబాబు ఉత్సవం, నేల వేషాలతో ఉత్సవ ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కోన నాగేశ్వరరావు తెలిపారు.

పేదల పక్షపాతి జగన్‌కు అండగా నిలుద్దాం

- ఫ్యాన్ గుర్తుపై ఓటేసి జగన్‌ను మళ్లీ సీఎంను చేద్దాం
- 84వ వార్డులో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



చౌడేశ్వరి స్వామివారిని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్



నెయ్యిలవీధిలో వృద్ధులను ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థిస్తున్న భరత్‌కుమార్



పరవాడపాలెంలో గడప గడపకు ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న పోరాటమని, పేదలకు అండగా ఉండే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ కోరారు. స్థానిక 84వ వార్డు పరిధిలో పార్టీ సీనియర్ నాయకులు గాలి మాధురీనాయుడు ఆధ్వర్యంలో పిళ్లావారివీధి, యర్రావారివీధి, నెయ్యిల వీధి, గొల్ల వీధి, బొడ్డువీధి, సాంబశివవీధుల్లో ఆదివారం గడప గడపకూ తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత సాంబశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని భరత్‌కుమార్‌కు హారతులిచ్చి, దీవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో రాష్ట్రంలో బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుపేదల సొంతింటి కల నెరవేరిందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ స్థలంలో జగనన్న కాలనీ లేఅవుట్‌లు వేసి, ఇళ్లను నిర్మించారు. ఇప్పటికే చాలా మంది గృహప్రవేశాలు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య సేవలు, ఉచిత మందులు అందించినట్లు తెలిపారు. మెరుగైన చికిత్స అవసరమైన రోగులను ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్చి చికిత్స అందించడమే కాకుండా, రోగి కోలుకున్న సమయంలో ఆసరాగా వారి బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయాల్సిందిగా అడిగే ఏకైక ముఖ్యమంత్రి దేశంలో జగన్ ఒక్కరేనని కొనియాడారు. చంద్రబాబు కూటమిగా పొత్తులు పెట్టుకుని గెలిచాక, వారితోపాటు, ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా గాలికి వదిలేసిన విషయాన్ని ప్రజలు మర్చిపోరని పేర్కొన్నారు. ఈ సారి కూడా బాబు గెలుపుకోసం బీజేపీ, జనసేనతో పొత్తులు పెట్టుకున్నారని, ఈ పొత్తులు కత్తులుగా మారే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. పేదవాడు ఆర్థికంగా ముందుకు వెళ్లాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నేతలు మావూరి వెంకటేష్, కోరిబిల్లి శ్రీను, కాండ్రేగుల శేషు, దిమిలి సత్తిబాబు, మురళి, ఏడువాకల నారాయణరావు, ఎస్ఈ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: పేద ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలో ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేయడంలో భాగంగా ఆదివారం రాత్రి పరవాడపాలెం గ్రామంలో గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. మహిళలు అడుగడుగునా హారతులు పట్టారు. పలువురు పూలమాలలు, దుశ్శాలువాలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ప్రజలు ఎంతో సుఖసంతోషాలతో జీవిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా తనకు ఒక అవకాశం ఇస్తే నియోజకవర్గంలోని యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారం సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించి పూజలు చేశారు. ప్రచారంలో ఆయన వెంట ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, పార్టీ నాయకులు లగిశెట్టి గణేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు



బలిజపాలెం దుర్గాలమ్మ

సబ్బవరం: మండలంలోని నారపాడు శివారు బలిజపాలెంలో కొలువైన దుర్గాలమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మామిడి కొండాజీ తెలిపారు. గ్రామంలోని వరసిద్ధి వినాయక సేవా సంఘం, శ్రీ దుర్గాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో నిర్వహించనున్న భారీ అన్నసమారాధనలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

నూకాంబిక జాతరకు విస్తృత ఏర్పాట్లు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో సోమవారం కొత్త అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారి జాతరను పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. 35 ఏళ్ల కిందట స్వర్గీయ బోకం దేముడు బాబు ఆలయం నిర్మించిన నుంచి అమ్మవారి జాతర నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుందన్నారు. దీనిలో భాగంగా సోమవారం అమ్మవారికి కుంకుమార్చన,ధూపదీప నైవేద్యాలు సమర్పించనున్నట్లు తెలిపారు.